క్లుప్తంగా

అనుమతి లేని విక్రయాలపై చర్యలు



ఆక్వా ఫీడ్ దుకాణంలో సీజ్ చేసి పౌడర్ ప్యాకెట్లను చూపుతున్న మత్స్యశాఖాధికారులు

చిల్లకూరు: ఆక్వా సాగుకు అవసరమైన ఫీడ్, పలు రకాల మందులు అనుమతులు లేకుండా విక్రయించిన వారిపై చర్యలు తప్పవని మత్స్యశాఖ ఏడీ రాజేష్ హెచ్చరించారు. చిల్లకూరులోని పలు ఆక్వా ఫీడ్ దుకాణాలపై టాస్క్ ఫోర్సు అధికారులు గురువారం దాడులు చేశారు. పలు దుకాణాలు, గోడౌన్లలో ఫీడ్, రసాయనాలు, పలు రకాల పౌడర్ ప్యాకెట్లను తనిఖీ చేశారు. వాటిలో కొన్నింటికి అనుమతులు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి, రెండు దుకాణాలకు రూ.25 వేల చొప్పున జరిమానా విధించారు. ఆయన వెంట తిరుపతి జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ ప్రశాంతి, చిల్లకూరు మత్స్యశాఖాధికారి రఘుబాబు, సచివాలయం అసిస్టెంట్లు తేజస్వినీ, విజయ, వరప్రసాద్, వీఆర్వో రమణయ్య తదితరులు ఉన్నారు.

జీఈఆర్ శతశాతం సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

గూడూరురూరల్: బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండేలా తక్షణం చర్యలు తీసుకుని గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (జీఈఆర్) నూరు శాతం సాధించాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 4వ తేదీ లోపు బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించి, ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల వారీగా సర్వే చేసి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడం జరిగిందని, వారందరినీ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇన్చార్జి ఎంఈఓ సనత్కుమార్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్సీలో ఎంఈఓ సనత్కుమార్ సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ప్రతి చిన్నారిని బడిలో చేర్పించాలని సూచించారు.

సేంద్రియ ఎరువులను వాడాలి



మాట్లాడుతున్న ఏడీఏ ఉమ

పెళ్లకూరు: వరిసాగులో రసాయనాల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలని నాయుడుపేట ఏడీఏ ఉమ పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరులో జరిగిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతులు పంట సాగులో ఆధునిక, సాంకేతిక యాజమాన్య పద్ధతులను పాటించి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులను సాధించాలన్నారు. సాగుకు ముందు భూసార పరీక్షలు చేసుకుని పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఓ ప్రవీణ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ను ప్రారంభిస్తున్న ఎంపీపీ

పెళ్లకూరు: చెన్నప్పనాయుడుపేటలో నూతనంగా నిర్మించిన వాటర్ప్లాంట్ను గురువారం జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, ఎంపీపీ శేఖర్రెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి గ్రాంట్ రూ. 8 లక్షలతో వాటర్ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పీ స్వప్న, ఎంపీడీఓ సురేష్బాబు, జేసీఎస్ కన్వీనర్ రఘునాయుడు, నాయకులు సురేష్రెడ్డి, చెంగయ్య, రమణయ్య, రవీంద్ర, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా పౌరహక్కుల దినం

దొరవారిసత్రం: మండలంలోని ఆర్మేనికండ్రిగ ఎస్సీకాలనీలో గురువారం తహసీల్దార్ గోపీనాథ్రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పౌరహక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుమలరావు, ఎంపీడీఓ సింగయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ తనియాలి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే పనులు, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు.

భారీ వర్షం

ఓజిలి: మండలంలోని ఓజిలి, మానమాల, కురుగొండ, రాచపాళెం తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోత, విపరీతమైన ఎండతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులతో కారు మబ్బులు కమ్ముకుని ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది. దీంతో వాతావరణం చల్లబడింది.

రక్తపుష్టి.. ఆరోగ్య పరిపుష్టి

సమాజంలో పేదలను రక్తహీనత పట్టి పీడిస్తోంది. దీంతో మాతా శిశుమరణాలు అధికమవుతున్నాయి. వీటి నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పేదల్లో రక్తపుష్టి పెంపొందించి, వారు ఆరోగ్యంగా పరిపుష్టిగా ఉండేలా చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ప్రారంభించింది. లబ్ధిదారులకు ఇంటి వద్దకే పోషకాహార పదార్థాలను పంపిణీ చేస్తోంది.

- ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ
- మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

సైదాపురం: మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. వారు ఆరోగ్యంగా ఉండేందుకు మరింత అదనపు పౌష్టికాహారం అందజేస్తోంది. అలాగే ఇటీవల ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని కూడా ప్రారంభించింది. ప్రతి ఇంటి వద్దకే పౌష్టికాహారం అందిస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అంగన్వాడీ కేంద్రాల నుంచే కాకుండా నేరుగా వారి ఇంటి వద్దకే అంగన్వాడీ కార్యకర్తలు వచ్చి అందజేస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఇళ్ల వద్దకే నేరుగా సరుకులు సరఫరా అందుతున్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నివారణకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఇంటికే పోషకాహారం

బాలింతలు, చిన్నారులకు ఇప్పటివరకు పాలు, గుడ్లు, రాగిపిండి, వేరుశనగ చిక్కీ, బెల్లం, బాలమృతం పంపిణీ చేస్తున్నారు. పాలు మోతాదుతోపాటు గుడ్ల సంఖ్య పెంచి అందజేస్తున్నారు. అలాగే అటుకులు, సజ్జ పిండి, కర్జూరం కిలో వంతున అందజేస్తున్నారు. ఇంటింటికీ పౌష్టికాహారం పంపిణీ చేస్తోంది. వాటితో పాటు ఇప్పుడు తాజాగా వారి ఇంటి వద్దకే పౌష్టికాహారం కూడా అందజేస్తోంది.

రాపూరు ఐసీడీసీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో..

కేటగిరి	లబ్ధిదారుల సంఖ్య
గర్భిణులు	823
బాలింతలు	752
చిన్నారులు	6,626
మొత్తం	8,201

అందరికీ అందేలా...

మాతాశిశు మరణాల నివారణలో భాగంగా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు చర్యలు చేపట్టింది. అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు సరఫరా చేయాలని ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం వస్తువులను తెచ్చి, పంపిణీ చేస్తున్నారు.



ఇంటి వద్దనే పోషకాహారం అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్త

జగనన్న మేలు మరవలేం



జగనన్న మేలు జన్మజన్మలకు మరవలేం. మాలాంటి పేదలకు అనేక పథకాలను అమలు చేస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా మా ఇంటి వద్దకే పౌష్టికాహారాన్ని తెచ్చి ఇస్తున్నారు. 10 నెలలు నుంచి నాకు వైఎస్సార సంపూర్ణ పోషణ పథకం ద్వారా పౌష్టికాహారం అందుతోంది.

\- చెంచమ్మ, బాలింత, సైదాపురం

ఇంటి వద్దకే సరుకులు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులను లబ్ధిదారుల ఇంటి ముంగిటకే వెళ్లి పంపిణీ చేస్తున్నాం. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అంగన్వాడీ కార్యకర్తలు కలిసి ఇంటి వద్దకే వెళ్లి సరుకులను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తున్నారు.

\- సునంద, సీడీపీఓ, రాపూరు

పీహెచ్సీలో విచారణ



దేవీ సత్రం పీహెచ్సీలో విచారిస్తున్న పీఓ మస్తానమ్మ

దొరవారిసత్రం: పీహెచ్సీలో వైద్య సిబ్బంది పనితీరుపై గురువారం ప్రోగామ్ ఆఫీసర్ మస్తానమ్మ విచారణ జరిపారు. మూడు రోజుల కిందట విధి నిర్వహణ విషయంలో వైద్యాధికారి చైతన్య, స్టాఫ్నర్స్ లక్ష్మీదేవి మధ్య వివాదం తలెత్తడంతో వాదోపవాదాలు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై వారిద్దరూ జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పీఓ పీహెచ్సీలో విచారణ చేపట్టారు. పీహెచ్సీలో సిబ్బందితో మాట్లాడారు. వారి నుంచి రాతపూర్వకంగా స్టేమెంట్లు తీసుకున్నారు. ఇది ఇలాఉండగా ఏకొల్లు, కుప్పారెడ్డిపాళెం గ్రామాలకు చెందిన పలువురు స్టాఫ్నర్స్ రోగులకు సరైన వైద్యసేవలు అందించకపోగా, దురుసుగా ప్రవర్తిస్తుందని పీఓకు ఫిర్యాదు చేశారు. వారిచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా ఓ నివేదికను సిద్ధం చేసి జిల్లా వైద్యాధికారులకు పంపి, తగు చర్యలు తీసుకోనున్నట్లు పీఓ తెలిపారు.

అవగాహన పెంచుకోవాలి

కోట: రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ పద్మావతి సూచించారు. మండలంలోని మైక్రోటవర్ గిరిజనకాలనీలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు కూలి పనులు చేస్తున్నా పిల్లలను మాత్రం తప్పనిసరిగా బడికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భవానీ, ఎస్ఐ పుల్లారావు, ఎంఈఓ మస్తానయ్య పాల్గొన్నారు.

నూతన పింఛన్లు మంజూరు

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని ఎనిమిది సచివాలయాల్లో నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ ప్రమీలారాణి తెలిపారు. మండలంలోని మొత్తం 129 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. సచివాలయాల వారీగా కొత్త పింఛన్ల వివరాలిలా ఉన్నాయి. ఆబాకలో 22, దామానెల్లూరు 10, కేఎసీఎస్ గుంట 12, కడపర్ర 26, కోటపోలూరు-1లో 18, కోటపోలూరు -2లో 10, మంగళంపాడు 20, మంగానెల్లూరులో 11 కొత్త పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు.

అందరూ భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట: దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి అన్నారు. నాయుడుపేట మండలం పూడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మేరా మాటీ..మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచ ప్రాణ్ ప్రతిజ్ఞను ప్రతి ఒక్కరూ తీసుకుని, అదే స్ఫూర్తితో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. గూడూరు డీవైఈఓ శివప్రకాష్రెడ్డి మాట్లాడుతూ భారత పౌరులంతా దేశభక్తిని అలవరుచుకోవాలన్నారు. ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్పర్సన్ కే దీపిక, ఎంఈఓ బీ మునిరత్నం పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

సూళ్లూరుపేటరూరల్: అంగన్వాడీ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న హెల్పర్లు, కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సూళ్లూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శారదాంబ తెలిపారు. తడ మండలంలోని మిని అంగన్వాడీ కేంద్రానికి కార్యకర్త పోస్టు, హెల్పర్ పోస్టు, దొరవారిసత్రంలో హెల్పర్ పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటికి అర్హులైన వారు సెప్టెంబర్ 11వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. బీసీ-ఏ రోస్టర్, బీసీ-డీ కులాలకు చెందిన వ్యక్తులు దరఖాస్తులు అర్హులన్నారు. ఆదాయ, ధ్రువీకరణ, విద్యార్హత పత్రాలతో సూళ్లూరుపేట సమగ్ర శిశు అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో దరఖాస్తు సమర్పించాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరిరూరల్: అధికారుల సూచనల మేరకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి, పంట సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వెంకటగిరి ఏడీఏ నాగార్జున సాగర్ పేర్కొన్నారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం ఆత్మ ఆధ్వర్యంలో మండలస్థాయి రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట సాగులో ఎరువుల వినియోగం మోతాదుకు మించి వినియోగించకూడదని తెలిపారు. అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. ఏఓ సుజాత, కేవీకే శాస్త్రవేత్త రాజీవన తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటకు చేరిన ధర్మప్రచార రథం



నాయుడుపేటలో శ్రీకాళహస్తీశ్వర ధర్మప్రచారరథం

నాయుడుపేట టౌన్: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ధర్మప్రచార రథం గురువారం నాయుడుపేటకు చేరింది. స్థానిక పోలేరమ్మ ఆలయం వద్ద ఆలయ ఈఓ పీ శాంతరావు, చైర్మన్ జీ సిద్ధయ్య, భక్తులు ప్రచారరథం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

నేడు కల్యాణోత్సం

జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం శుక్రవారం పట్టణంలోని స్వర్ణముఖి నది తీరంలోని ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీకాళహస్తి దేవస్థానం ఆలయ పండితుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మోటార్సైకిల్ను ఢీకొన్న లారీ.. ఇద్దరికి గాయాలు

పెళ్లకూరు: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో అక్కగారిపేట వద్ద గురువారం మోటారుసైకిల్ను లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కావలికి చెందిన రఫీ, కోటేశ్వరరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి పెళ్లకూరు సమీప గ్రామాల్లో బాతులు మేపుకునేందుకు వలస వచ్చారు. అయితే పనుల నిమిత్తం శ్రీకాళహస్తికి మోటారు సైకిల్లో వెళుతుండగా మార్గం మధ్యలో అక్కగారిపేట వద్ద వారి మోటార్సైకిల్ను లారీ ఢీకొంది. దీంతో వారిద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికులు శ్రీకాళహస్తికి తరలించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

కుంకుమార్చన





పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవికి భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన సేవ నిర్వహించారు. ఉదయం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ శ్రీవారి నందనంలోనికి వేంచేపు చేసి, కొలువుదీర్చారు. ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి, కుంకుమార్చన చేశారు. ఈ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. తరువాత తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. - రాపూరు

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన జగదీష్ , సురేష్

చిల్లకూరు: మండలంలోని పోటుపాళెం రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. చిట్టమూరు మండలం అద్దెపూడి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తిక్కవరంలోని తన సహోదరి వద్దకు వెళ్లి రాఖీ కట్టించుకుని తిరిగి నాయుడుపేటకు బైక్లో వెళుతుండగా పోటుపాళెం రోడ్డు వద్ద ఆ గ్రామానికి వెళుతున్న కారు బైక్ను ఢీ కొంది. దీంతో బైకులో ప్రయాణిస్తున్న జగదీష్, సురేష్కు తీవ్ర గాయాలు కాగా సింహాద్రికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వృద్ధుడికి బుక్లెట్లో వివరాలను తెలుపుతున్న నేదురుమల్లి రామ్కుమార్రెడ్డి

సైదాపురం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్కుమార్రెడ్డి అన్నారు. మండలంలోని మర్లపూడి సచివాలయం పరిధిలోని కోమటి గుంటరాజుపాళెంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు నేదురుమల్లికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. వారు పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఏమైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలని నేదురుమల్లి సూచించారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్మోహన్రెడ్డికే దక్కిందని, అవినీతికి అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించడంలో ఆంధ్రప్రదేశ్ను దేశంలో ప్రథమ స్థానంలో నిలిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ కార్యవర్గ సభ్యుడు వీ ప్రభాకర్రెడ్డి, డీ శంకర్రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ జీ శ్రీనివాసులురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులురాజు, సర్పంచ్ రత్నంరాజు, రాంగోపాల్రెడ్డి, మాల కొండారెడ్డి, అబ్బిరాజు, సింహ, శివారెడ్డి, సుబ్బరాజు, ప్రసాద్రాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పల్లేని ఓటర్ల జాబితా ఉండాలి



వాకాడులో ఓటర్ల జాబితా తనిఖీ చేస్తున్న ఆర్డీఓ కిరణ్కుమార్

చిల్లకూరు: తప్పులు లేని ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని గూడూరు ఆర్డీఓ కిరణ్కుమార్ సూచించారు. చిల్లకూరులోని రెండు పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. గ్రామంలోని పలు గృహాలకు నేరుగా వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలించి ఇంట్లోని వారి ఓటరు కార్డులను అడిగి తీసుకుని వత్యాసం ఏదైనా ఉందా అనే విషయాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ రమ్యస్వాతి ఉన్నారు.

వాకాడులో..

వాకాడు: మండలంలోని ఓటర్ల జాబితాను గూడూరు ఆర్డీఓ కిరణ్కుమార్ గురువారం తనిఖీలు చేశారు. ఆయన పలు గ్రామాల్లో పర్యటించి, ఓటర్ల జాబితాలోని వారు ఇటీవల కాలంలో ఎవరైనా మరణించినా, దొంగ ఓట్లు ఉన్నా, షిఫ్ట్ ఓటర్లు ఉన్నా తక్షణమే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ నరసింహారావు, డీటీ సారంగపాణి, ఆర్ఐ సెల్వ సిబ్బంది ఉన్నారు.

కోటలో..

కోట: మండల కేంద్రంలో ఓటర్ల సర్వేను ఆర్డీఓ కిరణ్కుమార్ పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి పాల్గొన్నారు.

నేదురుమల్లికి బ్రహ్మకుమారీల రాఖీ



నేదురుమల్లికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

వెంకటగిరిరూరల్: రాఖీ పౌర్ణమి సందర్భంగా వైఎస్సార్సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్కుమార్రెడ్డికి గురువారం ఆయన నివాసంలో బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే కౌన్సిలర్లు కే కళ్యాణి, వహిదా, పలువురు మహిళలు రాఖీలు కట్టారు.

వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ



బియ్యం బస్తాలు అందజేస్తున్న ఆర్డీఓ కిరణ్కుమార్

గూడూరురూరల్: పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమానికి గురువారం ఆర్డీఓ కిరణ్కుమార్ తనవంతు సాయంగా 10 బస్తాల బియ్యం వితరణ చేశారు. వీటిని ఆశ్రమ నిర్వాహకురాలు కల్యాణికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిరణ్కుమార్ మాట్లాడుతూ ఇటీవల వృద్ధాశ్రమానికి వచ్చినపుడు ఒకటో తేదీన బియ్యం బస్తాలు ఇస్తానని చెప్పానని, ఒకరోజు ముందుగానే పది బియ్యం బస్తాలు ఇచ్చామన్నారు. జీవిత చరమాంకంలో వృద్ధులు మానసికంగా, ఉల్లాసంగా ఉండేందుకు ఒక టీవీ కూడా అడిగారని, వచ్చే నెలలో టీవీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కులమతాలకు అతీతంగా వృద్ధులందరూ కలిసి ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



గంగమ్మకు పూజలు చేస్తున్న సాయికృష్ణ యాచేంద్ర

వెంకటగిరిరూరల్: పట్టణంలోని 17వ వార్డులో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట గురువారం ఘనంగా నిర్వహించారు. రాజా కుటుంబీకులు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర వేడుకల్లో పాల్గొని, పూజలు చేశారు. గంగమ్మ ఆలయాన్ని ప్రారంభించారు. పలువురు మహిళలు, భక్తులు ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పీ లక్ష్మి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీ బాబు, డీ రాధ పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు రాయితీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారి కార్తీక్

చిల్లకూరు: రైతులు పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు ముందుకు వస్తే వారికి ప్రభుత్వం పలు రకాల రాయితీలు అందించేందుకు సిద్ధంగా ఉందని ఉద్యానశాఖాధికారి కార్తీక్ తెలిపారు. మండలంలోని పారిచెర్లవారిపాళెంలోని ఆర్బీకేలో ఆత్మ పథకం కింద రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పలు రకాల నేలలున్నాయని, ఇవి జామ, బొప్పాయి, నిమ్మ, మామిడి, సాగుకు అనువుగా ఉన్నందున వీటిపై రైతులు మక్కువ చూపుతున్నారన్నారు. అలాగే తీర ప్రాంతంలోని మోమిడి, తమ్మినపట్నం, గ్రామాల్లో ఎక్కువగా ఇసుక నేలలు ఉన్నందున అక్కడి వారు జీడిమామిడి సాగు చేసుకోవచ్చని, దీనికి ఎక్కువ శాతం రాయితీ అందించే వీలుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు ఏఓ గూడూరు భవానీ, గూడూరు అగ్రి ల్యాబ్ టెక్నికల్ ఏఓ చెంచురెడ్డి పాల్గొన్నారు.